ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- నాడు కిలో మీటర్ల మేర క్యూలు
- నేడు గ్రామంలోనే అందుతున్న విత్తనాలు, ఎరువులు



గత టీడీపీ హయాంలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక ఇందిపడేవారు. ఒక బస్తా ఎరువులు, విత్తనాల కోసం కిలో మీటర్ల మేర క్యూలు కట్టి, మండుటెండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. అయినప్పటికీ విత్తనాలు దొరకక వేలాది రూపాయలు అప్పులు చేసి బ్లాక్‌లో కనుగోలు చేయాల్సి వచ్చేది. 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులతోపాటు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెంట గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం (నేడు)



పాలఖండ్యాంలో విత్తనాల కోసం మండుటెండలో క్యూలో ఉన్న రైతులు (నాడు)



పాలఖండ్యాంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోనే విత్తనాలను అందిస్తున్న దృశ్యం (నేడు)

– జి.సిగడాం

క్లుప్తంగా

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న విశాఖ డీసీపీ



ఆనందరెడ్డికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో గురునాథం

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని విశాఖ డీసీపీ ఆనందరెడ్డి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేయగా, క్షేత్ర మహాత్యాన్ని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు. ఆలయ ఈవో జి.గురునాథరావు కూర్మనాథుని చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆనందరెడ్డికి అందజేశారు.

8న బ్యాడ్మింటన్ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

జి.సిగడాం: మండల కేంద్రంలో మార్చి 8వ తేదీ శివరాత్రి పురస్కరించుకుని అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు జల్లేపల్లి శ్రీనివాసరావు, మహాదాస్యం జగన్నాథం, వెలిది వెంకన్న ఆదివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.400 రుసుం చెల్లించాలన్నారు. క్రీడాకారులకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. విజేతలకు ధ్రువీకరణ పత్రాలు, నగదు, బహుతులను అందిస్తామన్నారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా రాజాం మండలం, పొగిరి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫోన్ 73306 06524, 80748 54735 నంబర్లను సంప్రందించాలన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష



ఎచ్చెర్ల క్యాంపస్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీల్లో గ్రూప్ -2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలంలోని పలు పరీక్ష కేంద్రాలను జేసీ ఎం.నవీన్ పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రూట్ అధికారిగా మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు వ్యవహరించారు. పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక లైజన్ అధికారులను నియమించారు.

ఆధ్యాత్మిక ప్రవచనం



వక్త నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో భవద్గీతలోని తొమ్మిదో అధ్యాయమైన 'రాజవిద్య రాజ గుహ్యం'పై డాక్టర్ సనపల నారాయణమూర్తి ఆదివారం వివరించారు. గుహ్యం అంటే రహస్యం కాదని ఆసక్తి ఉన్నవారికే ఈ విద్య బోధించాలని అర్థమన్నారు. ఉపనిషత్తుల ప్రమాణములతో రాజవిద్య కోసం వివరించారు. ముందుగా వక్త నారాయణ మూర్తిని మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎం.మోహనరావు, నిష్టల నర్సింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, తవుడు, బి.కోమలరావు, డి.జి.పట్నాయక్, వెంకటరమణ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, అనూరాధ పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయానికి ఆనుకుని ఉన్న వీరాంజనేయ స్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా రాజమండ్రికి చెందిన భక్తులు భాస్కర భట్ల లక్ష్మణకుమార్, పుష్పలత దంపతులు లక్ష తమలపాకులతో ఆదివారం అర్చన చేశారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణ సమీపంలోని శ్రీపురం గ్రామానికి చెందిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని కుటుంబీకులు



ఆదిత్యుని జ్ఞాపికను తమ్మినేనికి అందజేస్తున్న ఈవో రమేష్‌బాబు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్ బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి గోత్రనామాలతో ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఆదిత్యుని జ్ఞాపికను తమ్మినేనికి ఈవో అందజేశారు. ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుని దర్శనం ఎంతో సంతృప్తినిచ్చిందని తమ్మినేని అన్నారు. స్పీకర్ భార్య, తొగరాం సర్పంచ్ వాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి నాగ్ ఉన్నారు.

ఘనంగా మెహెర్‌బాబా జన్మదిన వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: బాబా మందిరంలో మహిళల కోలాట ప్రదర్శన



గార: మెహెర్‌బాబా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెర వీధిలోగల మెహెర్ కేంద్రంలో అవతార్ మెహెర్‌బాబా 130వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న సుడా ప్లానింగ్ అధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రేమతత్వాన్ని పెంచాలనే బాబా వాక్యంతో సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. మెహెర్ ప్రేమిక సహవాస్‌కు అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐటీసీ అధికారి ఎస్.వి.సత్యన్నారాయణ మాట్లాడుతూ.. సేవతో బాబావారి ప్రేమను పొందాలని కోరారు. ముందుగా రిటైర్డ్ హెచ్‌ఎం. వి.నవీన్‌చంద్రుడు సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. జన్మ కాలిక ప్రార్థనలు, సంకీర్తన జరిగింది. చిన్నారులు, మహిళలచే లఘునాటికలు, కోలాట నృత్యాలు జరిగాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా 200 మందికి వస్త్రదానం, 1500 మందికి అన్నదానం చేశారు. ప్రశాంతి వృద్ధాశ్రమం, బెహరా మనోవికాస కేంద్రంలో పండ్లు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో పి.వి.రంగప్రసాద్, వరప్రసాద్, గుడ్ల సత్యన్నారాయణ, రాజు,సురేష్, ఆనంద్ కుమార్, పలు ప్రాంతాలనుంచి బాబా ప్రేమికులు హాజరయ్యారు.

గార: శ్వేతగిరిపై మెహెర్‌బాబా కేంద్రంలో ఆదివారం బాబా జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేంద్రం సెక్రటరీ రెడ్డి తాతబాబు, కార్యవర్గ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి, నామసంకీర్తన, భజనలు చేశారు.

వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానం



చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి 15వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి మార్చి ఐదో తేదీ వరకు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామితో పాటు ఆయన ప్రధాన శిష్యులు శ్రీత్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామిని వేదపండితులు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లో ఉన్న స్వామిని కలిసి ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కమిటీ ప్రతినిధుల ఆహ్వానానికి స్వాములిద్దరూ సానుకూలంగా స్పందించి, తప్పక వస్తామని చెప్పినట్టు కమిటీ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శానాపతి కిశోర్‌కుమార్, జామి ప్రసాదరావు, కరతల తిరుపతిరావు, జల్లు కాశీచరణ్, రఘుపతిరావు, మల్లేశ్వరరావు ఉన్నారు.

డీటీఎఫ్ మండల కమిటీల ఏర్పాటు

పొందూరు: స్థానిక శ్రీరామా డిగ్రీ కళాశాలలో ఆదివారం డీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. పొందూరు, జి.సిగడాం, సంతకవిటి, లావేరు మండలాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. పొందూరు మండలం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బలివాడ వెంకటేశ్వర్లు, గురుగుబెల్లి భాస్కరరావు, జి.సిగడాం మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శిల్లా భాస్కరరావు, జి.శ్రీరామదత్తులు, లావేరు మండలానికి అధ్యక్షుడిగా జి.బాలకృష్ణను నియమించారు. డీటీఎఫ్ కార్యకర్తలు జి.రాజశేఖర్, జి.గోపాలరావు, జి.రామారావు, జి.వెంకటరావు, బి.గజపతిరావు, బి.వి.రమణ పాల్గొన్నారు.

శిల్పకళా కళాకారుడికి సత్కారం



ఏసుబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

కవిటి: ముత్యాలపేటలో ఇటీవల ప్రతిష్ఠించిన అమృతవర్షిణీ సమేత మృత్యుంజయేశ్వరస్వామి, మోక్షసీతారామస్వామి ఆలయాలతో పాటు గణపతి, కుమారస్వామి, షిర్డీసాయి, అయ్యప్పస్వామి ఆలయాల్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శిల్ప కళాకారుడు ఏసు బాబు సేవలు ప్రశంసనీయమైనవని వక్తలు అన్నారు. ఆదివారం ముత్యాలపేటలో ఆలయాల సముదాయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏసుబాబుకు ఘనంగా పౌరసన్మానం నిర్వహించారు. నిర్మాణాన్ని ప్రారంభించిన అనతికాలంలోనే అన్ని ఆలయాల్ని సకాలంలో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన ఏసుబాబు బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వారి బృందానికి దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికల్ని అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ సమీపంలోని లింగాలపేట సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. క్షీరాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అన్నసమరాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు సనపల బాలకృష్ణ, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

98 మందికి వైద్య సేవలు



సూచనలిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: పెద్దకొంగరాంలో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గుండ భాగ్యశ్రీ ప్రారంభించారు. రాగోలుకు చెందిన జెమ్స్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల సిబ్బంది 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. మహాధాన్ ఆగ్రిటెక్ కంపెనీ ఆర్థిక సహకారం అందజేసిందని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు హిమశ్రీ, బ్రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టార్ అధికారుల నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో మొత్తం 309 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలకు మండలస్థాయి అధికారులు 37 మందిని సెక్టార్ అధికారులను జిల్లా అధికారులు నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించటం, పక్కాగా పోలింగ్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఓటర్లలో చైతన్యం కల్పించటం, ఓటు హక్కు వినియోగం పెరగటంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చదవడం మాకిష్టం



బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో పుస్తకాలు, పద్యాలు, కథలను గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్ర శేఖర్‌రావు చదివించారు. కథల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకులు బట్న సూర్యనారాయణ పాల్గొన్నారు.

వత్సవలస జాతరలో విషాదం

- అనారోగ్యంతో వ్యక్తి మృతి

గార: వత్సవలస తొలివారం జాతర కోసం వచ్చిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన అల్లాడ సింహాచలం (80) కుటుంబ సభ్యులతో కలసి వత్సవలస జాతరకు శనివారం రాత్రి వచ్చారు. రాత్రి అక్కడే పడుకొని అమ్మవారి దర్శన అనంతరం ఆదివారం మధ్యాహ్నం వంటలు పూర్తయ్యాక భోజన సమయంలో వడ్డిస్తూ కుప్పకూలిపోయాడు. వైద్య సేవలు అందేలోపు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్ని విధాలా సహాయం అందిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లావేరు పంచాయతీకి చెందిన తూట అప్పలరాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.4.50 లక్షల చెక్కు ఆదివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి లంకలపల్లి గోపి, లావేరు ఎంపీటీసీ ఇనపకుర్తి సతీష్, వైస్ సర్పంచ్ పైడి దాము, నాయకులు ఇనపకుర్తి రాంబాబు, సగరపు విశ్వనాథం, తలారి నాగయ్య తదితరులు ఉన్నారు.

పరామర్శ..

జే.ఆర్.పురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణశెట్టి శ్రీనివాసరావు తల్లి సరోజిని ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకుడు టేకి బ్రహ్మాజీ, తదితరులు ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద శివరాత్రి వేడుకలు



శివరాత్రి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భజన బృందం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళం గ్రామదేవత పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో శివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు శివజ్యోతి భక్త భజన బృందం కమిటీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆదివారం కరపత్రాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కమిటీ ప్రతినిధి పాపారావు గురుస్వామి మాట్లాడుతూ.. ఏకాహం భజన కార్యక్రమం మార్చి ఎనిమిదో తేదీ ఉదయం ఆరు గంటలకు ప్రారంభమై తొమ్మిదో తేదీ ఉదయం ఆరు గంటలకు ముగుస్తోందన్నారు. శివరాత్రి రోజు మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరు గంటల నుంచి తిరువీధి కార్యక్రమం ఉంటుందన్నారు. తిరువీధిలో కిల్లిపాలెంకు చెందిన దక్షిణాది సన్నాయిమేళం, ఖాజీపేటకు చెందిన చిన్నారులచే కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: అంబేడ్కర్ అందరివాడని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అంబటివానిపేట వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. గ్రామస్తులంతా సమన్వయంతో వైభవంగా విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రపంచంలో అనేక దేశాల రాజ్యాంగం మళ్లీ రాసే పరిస్థితి వచ్చిందని, భారత రాజ్యాంగం మాత్రం నేటికీ భిన్నమైన సంప్రదాయాలు, కులాలు, మతాలకు అతీతంగా చెక్కుచెదరకుండా ఉందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. ఒకేసారి రూ. 12,800 కోట్లు ఖర్చుచేసి 31 లక్షలు మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమన్నది రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిపని అన్నారు. స్కూళ్లు బాగు చేసి, అమ్మ ఒడి అందించడం వల్ల పేద పిల్లలు బాగు పడతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు కంత వేణు, సర్పంచ్ గొలివి వెంకటరమణ మూర్తి, ఎంపీటీసీ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హాజరై విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన వెంట గొండు శంకరరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• ఆత్మీయ సమ్మేళనం



1991-92 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 1991-92లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. పాఠశాల ప్రగతికి తమవంతు సహకరిస్తామన్నారు. ప్రిన్సిపాల్ దుప్పల దేవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని చిన్నకృష్ణాపురం మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1988-89లో ఏడో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. గురువుల పాదాలు కడిగి ఆశీర్వచనాలు తీసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ స్నేహితులందరూ సరదాగా గడిపారు.

సమాజానికి మరింత మేలు చేసే పనులు చేపట్టాలని ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులకు గురువులు సూచించారు. ఉపాధ్యాయులు తవిటమ్మ, జగన్నాథ రావు, ప్రసాదరావు, సీతారాం, శివరామకృష్ణ, కుశరాజు పాల్గొన్నారు.